సాక్షి
తిరుపతి

సోమవారం। 29। సెప్టెంబర్। 2025



గరుడవాహనంపై భక్త జన కోటిని కటాక్షిస్తున్న మలయప్పస్వామి

జగద్రక్షుడు, కలియుగ వైకుంఠుడైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆరు గంటలకే వరుణుడు ఆహ్వానం పలకగా.. గరుడ వాహనంపై విహరిస్తూ స్వామి కనువిందు చేశారు. జగాన్ని పాలించే జగత్కల్యాణ చక్రవర్తి మలయప్ప దేదీప్యమాన కాంతులతో ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. గోవిందా..గోవింద..! అంటూ భక్తులు స్వామి వారి దివ్యమంగళ రూపాన్ని దర్శించి తన్మయత్వం చెందారు. మునుపెన్నడూ లేని రీతిలో గరుడ సేవకు భక్తులు పోటెత్తారు.



తిరుమల మాడ వీధుల్లో అశేష భక్తజన వాహిని

గరుడోత్సాహం

వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- సాయంత్రం 6 గంటల నుంచే వాహన సేవ ప్రారంభం
- ఉదయం మోహినీ అవతారంలో మలయప్ప దర్శనం
- శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడుని అధిరోహించి కటాక్షం
- జగద్రక్షుడ్ని కనులారా వీక్షించి పులకించిన భక్తజనం
- భక్తులతో కిక్కిరిసిన తిరుమల కొండ
- నేటి స్వర్ణరథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల : అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజు ఆదివారం ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంత పల్లకీపై శృంగార రసాధి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్ని కృష్ణుడితో కలసి హోయ లొలుకుతూ భక్తకోటిని సాక్షాత్కరించారు.

కట్టుదిట్టమైన భద్రత

తమిళనాడు ఘటన నేపథ్యంలో పోలీసులు, అధికారులు తిరుమల భద్రతను మరింత పెంచారు. గరుడ వాహన సేవలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ సుబ్బరాయుడు పటిష్ట భద్రతను కల్పించారు. పరిమిత సంఖ్యలోనే భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయ వీధుల్లోకి రాకుండా కట్టడి చేశారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో నడిచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఆలయ సిబ్బంది అప్రమత్తతో భక్తులకు త్వరగా దర్శనం కల్పించారు. ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల అనుమతి లేకపోవడంతో భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్యాక్సీల్లో తిరుమలకు రావాల్సి వచ్చింది.



మోహినీ అవతారంలో ఊరేగింపుగా వస్తున్న గోవిందుడు



గరుడోత్సవంలో భాగంగా కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

కిక్కిరిసిన కొండ

గరుడ వాహన సేవ కోసం భక్తులు పోటెత్తారు. తిరుమల కొండ భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచే గ్యాలరీల్లో పడిగాపులు పడ్డారు. ఉదయం మోహినీ వాహన సేవలో పాల్గొన్న భక్తులే ఎక్కడికక్కడ గరుడ వాహన సేవ కోసం నిరీక్షించారు. రెండు లక్షల మంది కూర్చునే విధంగా సిద్ధం చేసిన గ్యాలరీలు మధ్యాహ్నం ఒంటి గంటకే నిండిపోయాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇలా రెండోసారి భర్తీ చేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.



బారులు తీరిన వాహనాలు



భక్తులను నియంత్రిస్తున్న పోలీసులు



మురుగన్ వేషధారణ




దేవతల వేషధారణలో కళాకారులు



వాహన సేవలో ఈవో

న్యూస్‌రీల్

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు పురస్కారం



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న మేనేజర్ శ్రీనివాసరావు

శ్రీసిటీ(సత్యవేడు) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక రంగం ఎంపిక చేసిన 2024–25 పర్యాటక ఎక్సలెన్సీ అవార్డులలో 'ఉత్తమ థీమ్–బెస్ట్ రిసార్ట్' అవార్డును శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆకర్షణీయమైన అతిథ్య సేవలకు గాను ఈ గుర్తింపు దక్కింది. శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం–25 సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ , సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరైన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మ్యాంగో రిసార్ట్ తరఫున రిసార్ట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఈ అవార్డును స్వీకరించారు. శ్రీసిటీలోని సుందర సువిశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్ 20 లగ్జరీ కాటేజీలు, 10 సాధారణ గదులను కలిగి ఉంది. ఇక్కడ బస చేసే అతిథులు మంచి ప్రకృతిని వీక్షించడంతో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్ పక్షులను వీక్షించడం వంటి వివిధ రకాల కార్యకలాపాలను ఆస్వాదించవచ్చు. శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు వరుసగా రెండవ సారి అవార్డు దక్కడం విశేషంగా చెప్పవచ్చు. రీసార్టును తీర్చిదిద్దిన విధానాన్ని ప్రశంసించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికమైంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 75,006 మంది స్వామివారిని దర్శించుకోగా 45,413 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆరుగురు విద్యార్థుల సస్పెన్షన్

నారాయణవనం: జూనియర్ విద్యార్థిపై సీనియర్లు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులను స్థానిక ప్రైయివేట్ కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. తన గర్ల్‌ఫ్రెండ్‌తో చనువుగా ఉన్నాడంటూ కళాశాల హాస్టల్లో ఉంటున్న అన్నమయ్య జిల్లాకు చెందిన జూనియర్ విద్యార్థిని బుధవారం రాత్రి తమ గదికి పిలిపించిన సీనియర్ తన ఐదుగురి స్నేహితులతో కలిసి దాడి చేసి, వీడియో రికార్డ్ చేశారు. బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురి సీనియర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సీనియర్లను సస్పెండ్ చేసి కళాశాల హాస్టల్ నుంచి వారి తల్లిదండ్రులతో పంపించినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

మట్టి.. కొల్లగొట్టి

- కొత్త మంగళం చెరువులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- రోజుకు 300 ట్రిప్పుల వరకు మట్టి రవాణా
- చెరువు కట్ట తొలగించి రహదారి ఏర్పాటు
- వర్షాకాలం సమీపిస్తుండటంతో స్థానికుల భయాందోళన
- చోద్యం చూస్తున్న అధికారులు



చెరువు కట్టను తొలగించి దారి వేసుకున్న దృశ్యం



కొత్త మంగళం చెరువులో మట్టిని తవ్వి టిప్పర్‌కు వేస్తున్న హిటాచీ

సాక్షి టాస్క్ ఫోర్స్: జిల్లా కలెక్టర్ పరిపాలన భవనం వెనుక కూతవేటు దూరంలో ఉన్న కొత్త మంగళం చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి కొల్లగొడుతున్నారు. నేషనల్ హైవే పేరుతో అనుమతులు ఉన్నాయంటూ రోజుకు వందల సంఖ్యలో టిప్పర్లతో అక్రమంగా మట్టి రవాణా చేసి దోచుకుంటున్నారు. చెరువులో సుమారు 20 నుంచి 30 అడుగుల లోతు వరకు గుంతలను తవ్వేశారు. కలెక్టర్ కార్యాలయానికి అతి చేరువలో ఇంత జరుగుతున్న అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజల్లో విస్మయం వ్యక్తం అవుతోంది. మట్టి రవాణా చేసేందుకు చెరువు కట్టను తొలగించి చెరువులో నుంచి హైవే మీదకు దారి ఏర్పాటు చేసుకొని మట్టి రవాణా చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా భారీ వర్షాలు కురిస్తే చెరువు కట్ట తెగే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులకు అధికారుల అండ

మట్టి తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో ఉన్న వ్యక్తులు ఎవరు వెళ్లి అడిగినా ఇరిగేషన్ అధికారుల అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. ఏ అనుమతులు ఉన్నాయి? ఎవరిచ్చారు అంటే సమాధానం చెప్పడం లేదు. రెవెన్యూ అధికారులు సైతం ఇరిగేషన్ అధికారుల అనుమతితోనే మట్టి తవ్వకాలు చేస్తున్నారని చెప్పడం గమనార్హం.

దర్జాగా రవాణా


రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లతో రోజుకు వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. నిజంగానే ఇరిగేషన్ అధికారులు హైవే అవసరం కోసం అనుమతులు ఇచ్చారా? ఇస్తే ఎంత వరకు అనుమతి ఇచ్చారనేది గందరగోళంగానే ఉంది. అధికారులు పర్యవేక్షిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. హైవే పేరుతో ప్రైవేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తూ కోట్లు కొల్లగొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్థానిక కూటమి నేతలకు మామూళ్లు

స్థానిక అధికార పార్టీ కూటమి నాయకులకు మట్టి తరలించే వ్యక్తులు మామూళ్లు ముట్టజెబుతుండడంతో అధికారులు వారిని ఇబ్బంది పెట్టకుండా కూటమి నాయకులు చూసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. కూటమి నాయకుల ఒత్తిడి వల్లే చెరువుల్లో మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా నోరు మెదపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పక్కనే ఉన్న తూకివాకం చెరువులో స్థానిక కూటమి నాయకుడికి మామూళ్లు ఇవ్వలేదని పనులు నిలిపేశారు. అందువల్లే ప్రస్తుతం కూటమి నాయకులకు మామూళ్లు ముట్టజెప్పి యథేచ్ఛగా మట్టిని దోపిడీ చేసి రూ.లక్షలు దోచుకుంటున్నారు.



మట్టి తరలింపునకు సిద్ధంగా ఉంచిన టిప్పర్లు



చెరువులో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు



చెరువులో ఏర్పాటు చేసుకున్న దారి

తిరుమలలో అప్రమత్తమైన పోలీసులు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మధుసూదన్ రెడ్డి

తిరుమల : తమిళనాడులో తొక్కిసలాట జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డిని తిరుమలకు పంపించారు. తిరుమల గరుడ సేవలో భద్రతపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుని ఆరా తీసి పలు ప్రాంతాల్లో పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జాయింట్ స్క్రీన్‌ల ద్వారా పరిశీలించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక క్రౌడ్ మేనేజ్మెంట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ , ఎమర్జెన్సీ సర్వీసులు వైద్య బృందాలు కదలికపై అధికారులు ప్రత్యేక సూచనలు తెలిపారు.

జిల్లాకు ఉత్తమ ప్రకృతి విస్తరణ అవార్డు



ఉత్తమ అవార్డును అందుకుంటున్న షణ్ముగం

తిరుపతి అర్బన్: గుంటూరు అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రకృతి వ్యవసాయంపై ఏరువాక ఫౌండేషన్ వారు కిసాన్ మహోత్సవం –2025 కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన ప్రకృతి జిల్లా అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ క్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముగంకు ఉత్తమ అవార్డు అందుకున్నారు.

క్లుప్తంగా

స్విమ్స్‌లో ఘనంగా వరల్డ్ హార్ట్ డే



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : స్విమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. బీపీని కంట్రోల్‌లో ఉంచుకోవడం వల్ల స్ట్రోక్, పక్షవాతం లాంటివి తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఉదయం 20 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల బీపిని అదుపులో ఉంచుకోవచ్చునని తెలిపారు. అధికంగా మందులు వాడటం వల్ల కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, సోడియం తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అధిక బరువును నియంత్రించుకోకపోతే అధిక రక్తపోటుకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అనిల్, డాక్టర్‌వాహిద్ ఖాన్, డాక్టర్ రోహిత్, డాక్టర్ ఉపేంద్ర, హరీష్ చౌదరి, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసేవారు 0877-2227208కి కాల్ చేయాలని తెలిపారు. నేరుగా కార్యాలయంలో అధికారులకు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు.

లారీని ఢీకొన్న బైక్

- బైక్ నడుపుతున్న యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో మృతి చెందిన వెంకట చందు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని అయ్యప్పరెడ్డి పాళెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం లారీని బైక్ వేగంగా వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో మండల పరిధిలో ని పండ్లూరు గ్రామానికి చెందిన బైక్ నడుపుతున్న వెంకట చందు(26) అనే యువకుడు మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన తిరుమల అనే యువకుడు తీవ్రంగా గాయపడగా పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. పండ్లూరు గ్రామానికి చెందిన వెంకట చందు, తిరుమల, కృష్ణతేజ అనే ముగ్గురు యువకులు అయ్యప్పరెడ్డి పాళెం గ్రామ సమీపంలో నదిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. తిరిగి సాయంత్రం బైక్ పై పండ్లూరు గ్రామానికి వస్తూ అయ్యప్పరెడ్డిపాళెం వద్ద ముందు వెళుతున్న లారీను వీరి బైక్ ఢీకొంది. బైక్ నడుపుతూ తీవ్రంగా గాయపడిన వెంకట చందు అక్కడిక్కడే మృత్యువాత పడ్డాడు. వెనుక కూర్చుని ఉన్న తిరుమల తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరి వెనుక కూర్చున్న కృష్ణతేజ మాత్రం ప్రమాదం నుంచి బయట పడ్డాడు. సీఐ బాబి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడునిపై గోవిందుడు



భక్తజన సందోహం మధ్య సాగుతున్న గరుడ వాహన సేవ



గరుడుని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తున్న మలయప్ప

- వైభవంగా శ్రీ కల్యాణ వెంకన్న గరుడోత్సవం

తిరుపతి రూరల్ : కోలాటాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళా రూపాలతో తుమ్మలగుంట గ్రామం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం వైభవంగా సాగింది. తిరుమలకు వెళ్లి శ్రీవారి గరుడోత్సవాన్ని తిలకించలేని సుమారు 75 వేల మంది భక్తులు తుమ్మలగుంటకు చేరుకుని గరుడోత్సవాన్ని తిలకించారు. రాత్రి 7.30 గంటలకు బయలుదేరిన గరుడ వాహనం అర్ధరాత్రి 12.30 గంటల వరకు సాగింది. కల్యాణ వేంకటేశ్వరుడు గరుడునిపై మలయప్ప స్వామిగా కొలువుదీరి భక్తులను కటాక్షించారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గరుడ వాహనం ముందు కాగడాలు భక్తులను ఆకర్షించాయి. గరుడోత్సవం ప్రారంభానికి మూడు గంటల ముందు చిరుజల్లులతో స్వాగతం పలికాయి. వర్షం కురిసిన కొద్ది సేపటికే స్వామి వారికి సమర్పించే గరుడ మాల, మేల్‌చాట్ వస్త్రాలు ఆలయం వద్దకు చేరుకున్నాయి.

శ్రీవారికి సారె సమర్పణ

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడసేవ ప్రారంభానికి ముందు ఇస్కాన్ ఆలయం నుంచి ఇస్కాన్ మందిరం ఉపాధ్యక్షులు రూపేశ్వర చైతన్య ప్రభుదాస్, కార్యదర్శి బలబద్ర ప్రభుల ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను సమర్పించారు. ఇస్కాన్ ప్రతినిధులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి శ్రీవారికి సారె సమర్పించారు.

మోహినీ అవతారంలో దేవదేవుడు



గొడుగులను సమర్పిస్తున్న చెంచురెడ్డి కుటుంబీకులు



స్వామిని దర్శించుకుంటున్న చెవిరెడ్డి కుటుంబీకులు

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజైన ఆదివారం ఉదయం స్వామి వారు పల్లకీపై మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గరుడోత్సవానికి ముందుగా స్వామి వారు మోహినీ అవతారం ధరించి భక్తులను కటాక్షించారు. పల్లకీపై ఊరేగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కంకణభట్టార్ శ్రీనివాసాచార్యులు ఆలయం వద్దనున్న అలంకార మండపంలో స్వామి వారిని మోహినిగా ముస్తాబు చేసి పల్లకీపై కొలువుదీర్చారు. అనంతరం పల్లకీ ఉత్సవం వైభవంగా సాగింది.

అట్టహాసంగా ఊరేగింపు

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి గరుడోత్సవానికి ఉపయోగించే నూతన గొడుగులు, మేల్‌చాట్ వస్త్రాలను తుమ్మలగుంట గ్రామానికి చెందిన చెంచురెడ్డి ఇంటి నుంచి సంప్రదాయంగా తీసుకొచ్చారు. వాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ నూతన గొడుగులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అందజేశారు. గరుడోత్సవానికి ఉపయోగించే ఆ గొడుగులకు గ్రామస్తులు కర్పూర హారతులు పట్టారు. నూతన గొడుగులను చెంచురెడ్డి కుటుంబీకుల నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వీకరించారు.

భక్తులచే సారె సమర్పణ

పల్లకీపై ఊరేగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం, కేసీపుట, చిగురువాడ, వేదాంతపురం, పైడిపల్లి, పాతకాల్వ, రామానుజపల్లికి చెందిన భక్తులు తీసుకొచ్చిన సారెను ఆలయంలోని మూలమూర్తి ముందు పెట్టి పూజ చేశారు. సారె తీసుకొచ్చిన భక్తులు అందరికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సాదర స్వాగతం పలికి దైవ దర్శనం చేయించారు.

పేరూరు నుంచి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి గరుడోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా పేరూరు వాసులు అందించే పట్టువస్త్రాలను ఈ ఏటా సమర్పించారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, పి.కేశవులు రెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, సి.మునికుమార్‌రెడ్డి, వి.బాలక్రిష్ణ, దామోదరం అయ్యవార్లతో పాటు గ్రామస్తులతో కలసి స్వామి వారికి సమర్పించే పట్టువస్త్రాలకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎదురేగి స్వాగతం పలికారు. పట్టువస్త్రాలతో పాటు గజమాల, వివిధ రకాల పండ్లు సమర్పించారు.



గరుడ వాహనాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు



వాహన సేవలో దేవతామూర్తుల కళా రూప ప్రదర్శన



గరుడవాహనం ముందు ప్రత్యేక ఆకర్షణగా కాగడాలు

ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

తిరుపతి కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగుల కు 12 నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.శ్రీధర్, ఎం. రమేష్ కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు రాష్ట్ర స్థాయి అధికారులకు విన్నవించి నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామ ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నేతలు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేబిస్ అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణనాయక్

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం వరల్డ్ రేబిస్ అవేర్‌నెస్ డేను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో తిరుపతిలో ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. కుక్క కరిచినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స చేసి వైద్యులను సంప్రదించాలని, రేబిస్ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మురళీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, స్వరూప్, లావణ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుబాట

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని గంధమనేని శివ య్య భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సి ల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలులో దూకుడు పెంచిందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి పది గంటల పని విధానా న్ని అమలుచేయాలని క్యాబినెట్, అసెంబ్లీలో తీర్మా నం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు ఎన్‌డీ.రవి, శివ, కేవై.రాజా, వైఎస్.మణి, గోవిందస్వామి, కత్తిరవి, మల్లికార్జున, నాగరాజమ్మ, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చింది జాషువా సాహిత్యమే



నివాళులర్పిస్తున్న రాపూరు ప్రసాద్ బాబు

తిరుపతి సిటీ: తెలుగు కవిత్వంతో సమాజంలో మార్పు తెచ్చి, ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చిన మహాకవి, సంఘ సంస్కర్త గుర్రం జాషువా అని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రాపూర్ ప్రసాద్‌బాబు కొనియాడారు. స్థానిక గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగ, జో రేపల్లి కాటయ్య, ప్రభు, అర్జున్, నరేష్ పాల్గొన్నారు.

అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ప్రారంభం



కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి ఆదేశాల మేరకు నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి అధ్యక్షతన ఆదివారం తిరుపతిలో డిజిటల్ బుక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలనలో పార్టీలోని ఎవరైతే అన్యాయంగా నష్టపోతున్నారో, తప్పుడు కేసులకు బలవుతున్నారో, అలాంటి నాయకులకు, కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని, అరాచకాలను డిజిటల్ కోడ్ ద్వారా లాగిన్ అయ్యి డిజిటల్ బుక్ లో అప్లోడ్ చేయాలన్నారు. తద్వారా మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవడానికి మన కోసం ఏర్పాటు చేసిందే ఈ డిజిటల్ బుక్ అన్నారు. అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు కోసం రూపొందించినదే ఈ డిజిటల్ బుక్ అంటూ మరోసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో తిరుపతి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు బస్సులేవీ గోవిందా?





బస్సుల కోసం ఏడుకొండల బస్టాండ్ ఆవరణలో నాలుగు వైపులా వెళుతున్న భక్తులు.. ప్రయాణికుల పాట్లు



ఏడుకొండల బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న భక్తులు

- తిరుపతి నుంచి తిరుమలకు బస్సుల కొరత
- ఏడుకొండలు, అలిపిరి బస్టాండ్‌లో భక్తుల ఆగచాట్లు

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం గరుడోత్సవానికి బస్సులు లేక భక్తులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఎక్కడికక్కడ భక్తులు రోడ్లపైన, బస్టాండ్లల్లో నిరీక్షించాల్సి వచ్చింది. ఉత్సవాలకు 425 బస్సులు ఏర్పాటు చేశామని, మూడు వేలకు పైగా ట్రిప్పులు తిప్పనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పారు. కానీ ఆ బస్సులు ఏమైనాయో కానీ భక్తులు మాత్రం అవస్థల్లో మునిగిపోయారు.

ఏడు కొండల బస్టాండ్

తిరుమలకు భక్తులు వెళ్లడానికి తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని ఏడుకొండల బస్టాండ్ కీలకం. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ద్వితీయ, తృతీయ స్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉండిపోయారు. ప్లాట్‌ఫాంలో బస్సులను పెట్టకుండా ముందు భాగంలో ఖాళీ స్థలంలో ఎక్కడి పడితే అక్కడ ఉంచేశారు. ఈ క్రమంలో భక్తులు ఓ వైపు బస్సు కోసం పరుగులు పెట్టడం.. ఆ బస్సు ఫుల్ కావడంతో.. మరో బస్సు కోసం పరుగులు పెట్టడం కనిపించింది. దివ్యాంగులు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు నాలుగు వైపులా బస్సు కోసం పరుగులు పెట్టలేక తిప్పలు పడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ఏడు కొండల బస్టాండ్ సమీపంలోనే చెత్త కుప్పలను తొలగించకుండా అలానే వదిలేశారు. దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడ్డారు. ఏడుకొండల బస్టాండ్, పల్లెవెలుగు బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేవు. శ్రీహరి బస్టాండ్‌లోని ఒక మరుగుదొడ్డి ఇటీవల తొలగించారు. మిగిలిందే ఒక్కటే ఉండగా.. అది శుభ్రం చేయకపోవడంతో భక్తులు దుర్వాసన భరించక తప్పలేదు.

ఇతర ప్రాంతాలకూ బస్సులు లేవు

ఏడుకొండల బస్టాండ్‌లోనే కాకుండా అదే ప్రాంగణంలోని పల్లెవెలుగు, శ్రీహరి, శ్రీనివాసం బస్టాండ్ల వద్ద బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. శ్రీకాళహస్తి-తిరుపతి మధ్యలో 20కిపైగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. వాటిని శ్రీకాళహస్తికి రద్దు చేసి తిరుపతి-తిరుమలకు తిప్పుతున్నట్లు ప్రకటించారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, పుత్తూరు, పీలేరు తదితర ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుల కొరతతో పల్లె వెలుగు వద్ద ప్రయాణికులు పడిగాపులు పడ్డారు.

ఇదేం తీరు

సాధారణంగా తిరుమలకెళ్లే భక్తులను మెయిన్ బస్టాండ్‌కు తీసుకొచ్చి దింపాల్సి ఉంది. కానీ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో తిరుమల నుంచి వచ్చే భక్తులను కపిలతీర్థం వద్దే దింపేశారు. భక్తులు మళ్లీ అక్కడి నుంచి ఆటో పట్టుకుని మెయిన్ బస్టాండ్‌కు రావాల్సి వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తికమకపడ్డారు.

నిరీక్షించలేక

శ్రీవారి గరుడ సేవ సాయంత్రం ఆరు గంటలకే ప్రారంభమైంది. ఆపై వర్షం రావడంతో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఎప్పటికప్పుడు గ్యాలరీల నుంచి బయటకొచ్చేశారు. ఆపై ఇళ్లకు వెళ్లేందుకు బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ సరిపడా బస్సులు లేకపోవడంతో.. రాంభగీచా వద్దకు వెళ్లారు. అక్కడా అదే పరిస్థితి. వచ్చే ఒకటీ రెండు బస్సుల్లో ఎక్కేందుకు కుస్తీలు పడాల్సి వచ్చింది.

ప్రయాణికుల సిగపట్లు



తిరుమలలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న భక్త జనం



తిరుమలలో బస్సు వద్ద సిగపట్లకు దిగిన యాత్రికులు



తిరుమలలో బస్సులో ఎక్కేందుకు ఎగబడ్డ యాత్రికులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గరుడోత్సవానికి భక్తులు పోటెత్తారు. వారికి తగిన ప్రయాణ సేవలు అందించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమైంది. తిరుమలకు సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారనే ప్రాథమిక అంచనా వేసిన ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా చివరకు చేతులెత్తేశారు. ఆదివారం ఉదయం నుంచే ప్రయాణికులు తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు, రైల్వేస్టేషన్, అలిపిరి బస్టాండ్‌కు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బస్సుల కోసం పడిగాపులు పడ్డారు. బస్సులో ఎక్కేందుకు తోపులాటలో ప్రయాణికులు సిగపట్లకు దిగారు. కొందరు ముష్టి యుద్ధానికి పాల్పడడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి చేరుకునేందుకు పడ్డకష్టాలు అన్నీ ఇన్నీ కావు.